

వివేకానందనగర్‌లో అక్షింతలు పంపిణీ చేస్తున్న పులిగొళ్ల శ్రీనివాస్

అయోధ్య బాల రాముడి అక్షింతల పంపిణీ

అల్లాపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న అయోధ్య భవ్య రామ మందిరంలో జరగనున్న రాములవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని అక్కడి నుంచి తెప్పించిన బాలరాముడి అక్షింతలను అల్లాపూర్ డివిజన్‌లో సోమవారం పంపిణీ చేశారు. బీజేపీ మేడ్చల్ జిల్లా ఓబీసీ కార్యదర్శి పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, బొంత హరికృష్ణ, ప్రసన్నాంజనేయులు, ఆవుల అంజనేయులు, విత్తనాల కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి చిత్తారమ్మ జాతర

షాపూర్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గాజుల రామారం చిత్తారమ్మ జాతర ఈనెల 19 నుంచి ప్రారంభం అవుతుందని ఆలయ కమిటీ ఛైర్మన్ కూన అనంతయ్యగౌడ్ తెలిపారు. అమ్మవారి జాతరను ఎనిమిది రోజులపాటు నిర్వహిస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సుభద్రాదేవికి ప్రత్యేక పూజలు

బాలానగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామ మందిరం నిర్మాణం పూర్తయిన సందర్భంగా బాలానగర్‌లో తెలంగాణ హిందూ సేవా సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం సుభద్రాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవా సంఘ్ ఛైర్‌పర్సన్ తివారీ, అధ్యక్షుడు ప్రమోద్ మోదీ, యువజన విభాగం అధ్యక్షుడు విక్రమ్ తివారీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేసి, సుమారు 200 మంది మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారిని రథంపై పురవీధుల్లో ఊరేగించారు. సంఘ్ సభ్యులు ప్రమోద్ శర్మ, గోవింద్, రాజునాయక్, జ్యోత్స్నారాణి, సంధ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి'

జీడిమెట్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బేతాళ ప్రేయర్ చర్చిలో ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ పత్రాలు అందజేత

మియాపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డికాలనీకి చెందిన రాధ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 1.50 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



క్యాలెండర్ ఆవిష్కరణలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీ కమ్మ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ సేవా సమితి కేపీహెచ్‌బీ (కమ్మ సంఘం) 2024 క్యాలెండర్‌ను వసంతనగర్‌లో సంఘం కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం తరఫున విద్యార్థులకు విద్య, ఉద్యోగ, వసతి సౌకర్యం కల్పించేందుకు పక్కా భవనం నిర్మించుకుందామని, అందుకు సభ్యులంతా సహకరించాలని ఆయన కోరారు. అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ యర్రా నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శి గణేశుని అజయ్‌కుమార్, సంద్ర వెంకటేశ్వరరావు, గంగూరి శ్రీనివాసరావు, జాస్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాల్లోకి

బీఆర్‌ఎస్ మహిళా నాయకులను అనుమతించొద్దు

బాలానగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల్లోకి బీఆర్‌ఎస్ మహిళా నాయకులు, ఆర్పీలను అనుమతించొద్దని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఫిషర్‌మెన్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆకుల నరేందర్ ముదిరాజ్ కూకట్‌పల్లి సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో మహిళా నేతలు ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం మారినా బీఆర్‌ఎస్‌కు చెందిన ఆర్పీలు, బీఎల్‌వోలు తమదే అధికారం అనే రీతిలో వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. స్పందించిన సర్కిల్ అధికారులు సెంటర్ల వద్దకు రావద్దని నలుగురు మహిళా నాయకులు, ఆర్పీలకు సూచించినట్లు తెలిసింది.

'సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల అదుపు'

ఓల్డుబోయినపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు అరికట్టవచ్చని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ఓల్డుబోయినపల్లి డివిజన్ ఎల్‌బీనగర్ అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

142 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

పేట్‌బషీరాబాద్/బాలానగర్/కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అల్వాల్, బాలానగర్ పరిధిలో నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 142 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. సుచిత్ర, అల్వాల్, కొంపల్లి, దూలపల్లి తదితర ప్రాంతాల్లో సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి పట్టుబడిన 72 మంది నుంచి వాహనాల ఆర్సీలు, లైసెన్స్‌లు తీసుకొని కేసు నమోదు చేశారు.



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

● బాలానగర్ పరిధిలో సనత్‌నగర్ మీటర్ ఫ్యాక్టరీ, శోభన బస్టాప్, గుడెన్‌మెట్ చౌరస్తా డీమార్ట్, మూసాపేట వద్ద ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 70 మందిపై కేసు నమోదు చేశారు. జేఎన్‌టీయూ ఎదుట పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.

ఆలయాల్లో పూజలు.. చర్చిల్లో ప్రార్థనలు



కల్వరి ప్రార్థనా మందిరంలో ప్రార్థనల్లో భక్తులు



కూకట్‌పల్లి వెంకటేశ్వరనగర్‌లో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



కుత్బుల్లాపూర్‌లో ఆలయంలో పూజల్లో భక్తులు

కూకట్‌పల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా కూకట్‌పల్లి ప్రాంతంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని దర్శించుకోవటానికి బారులుతీరారు. కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్టాపులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు.

● కూకట్‌పల్లి, వెంకటేశ్వరనగర్, మూసాపేట ప్రాంతాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పేట్‌బషీరాబాద్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే బారులు తీరారు. నూతన సంవత్సరంలో తమ ఆశలు నెరవేర్చాలని మొక్కులు చెల్లించుకున్నారు.

రాయదుర్గం: గచ్చిబౌలి టెలికాంనగర్‌లో సాయిదత్త గణపతి ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు.



వివేకానందనగర్‌లో ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బండి రమేష్



మంత్రి శ్రీధర్‌బాబుతో నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్



ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని సన్మానించిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తదితరులు

నేతలకు అభినందనల వెల్లువ

కూకట్‌పల్లి/కుత్బుల్లాపూర్/శేరిలింగంపల్లి జోన్ బృందం(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నేతలకు అభినందనలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును పీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ కలిశారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను మాజీ కార్పొరేటర్ కాందూరి నరేంద్రాచార్య కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కార్పొరేటర్ సతీష్‌గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ సబీహా బేగం ఎమ్మెల్యే కృష్ణారావును కలిసి మొక్క



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకులు, అభిమానులు



గవర్నర్ తమిళిసైకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ కాందూరి నరేంద్రాచార్య

అందజేశారు. కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిసి సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను బీజేపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌ను కాంగ్రెస్ నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పలువురు కలిశారు. గాజుల రామారం బాలయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డీసీసీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌గౌడ్, యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సోమవారం సచివాలయంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు సినిమాకు జేజేలు సీడీ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇట్క్లా సంస్థ నిర్వాహకులు డా. కె.ధర్మారావు రచించిన 91 వసంతాల తెలుగు సినిమాకు జేజేలు గేయ రూపక సీడీని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ఇటీవల తన నివాసంలో ఆవిష్కరించారు. తొలి సీడీని నిర్మాత రామసత్యనారాయణకు అందజేశారు. వీవీఎస్.ప్రసాదరావు, కమల ప్రసాదరావు, డా.భాస్కర్‌రెడ్డి, డా. విజయకుమార్, ప్రసాద్ సూపరనేని పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మానసికంగా కుంగుబాటుకు గురై, జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సరూర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్మన్‌ఘాట్ మాధవరం సెరెనిటీ అపార్ట్‌మెంట్ బి బ్లాక్ ఫ్లాట్ నెం.514లో పారేపల్లి మురళీకృష్ణ (హెచ్‌డీఎఫ్‌సీ ఉద్యోగి) కుటుంబం మూడేళ్లుగా నివసిస్తోంది. ఆయన తండ్రి వెంకటేశ్వర్లు(74) కొద్దికాలంగా మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల సోదరులు, వదినలు మరణించడంతో తాను ఒంటరినైపోయానని ఆందోళన చెందుతున్నాడు. ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో ఇంట్లో వారికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత ఐదో అంతస్థు నుంచి కిందపడ్డాడు.



వెంకటేశ్వర్లు (ఫైల్)

తలకు గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో 108కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

బాలానగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. విద్యుదాఘాతంతో ఓ మహిళ, లిఫ్టు గుంతలో పడి గుర్తుతెలియని వ్యక్తి, గుర్తుతెలియని వాహనం ఢీకొని మరొకరు మృతి చెందారు. ఫతేనగర్ గౌతమినగర్‌లో నివసిస్తున్న పి.శాంతయ్య భార్య ఎల్లమ్మ(43) నాగార్జున కాలనీకి చెందిన సాయి అనే కాంట్రాక్టర్ వద్ద భవన నిర్మాణ పనుల్లో కూలీగా పనిచేస్తోంది. ఆదివారం ఉదయం నాగార్జున కాలనీలో భవన నిర్మాణ పనులకు ఆమె వెళ్లింది. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగలడంతో తోటి కార్మికులు ఆమెను స్థానికంగాగల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త శాంతయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్టు గుంతలో పడి గుర్తుతెలియని వ్యక్తి..

రాయదుర్గం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ చంద్రనాయక్ తండా సమీపంలో నిర్మాణంలో ఉన్న లిఫ్టు గుంతలో పడి ఓ వ్యక్తి చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వయస్సు 30-40 సంవత్సరాలు ఉంటాయని, శరీరంపై బ్లాక్ కలర్ ప్యాంట్, బ్లాక్ కలర్ స్వెటర్, రెడ్ కలర్ టీ షర్ట్ ఉన్నాయని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో నివసిస్తున్న రాజేందర్ ఇంటీరియర్ డిజైన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం బయటకు వెళ్లి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండీలో అగ్నిప్రమాదం

రాయదుర్గం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లో గర్ల్‌ఫ్రెండ్ మండీ భవనంలో సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. దుర్గం చెరువు మెట్రోస్టేషన్ సమీపంలోగల భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో కరెంట్ వైర్లు ఒకదానికొకటి అంటుకోవడమే ఇందుకు కారణమని తెలిసింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక, డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.





జానకిరామరాజు పుట్టినరోజు వేడుకల్లో జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటా : జానకిరామరాజు

హైదర్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జానకిరామరాజు పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ఇన్‌చార్జిలు జగదీశ్వర్‌గౌడ్, బండి రమేష్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తల మధ్య జానకిరామరాజు కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని, పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానన్నారు. నాయకులు బోస్‌రెడ్డి, రంగనాథరాజు, గోవిందరాజులు, మురళీధర్‌రావు, కృష్ణారెడ్డి, సుబ్బరాజు, రవి, సంజీవరెడ్డి, ఎస్‌వీఎస్ రాజు, రామచంద్రరాజు, నాని, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ ఫ్యాన్స్ నూతన సంవత్సర వేడుకలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వసంత్‌నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఏపీలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కిలారు శ్రీనివాసబాబు, సిరిపురపు మధు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కటింగ్‌లో ఎన్టీఆర్ ఫ్యాన్స్





శిల్పారామంలో సందర్శకులు

సందర్శకులతో సందడిగా శిల్పారామం

రాయదుర్గం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సెలవుదినం కావడంతో శిల్పారామం సందర్శకులతో సందడిగా మారింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీదేవి ముంగర శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది. సాహిత్యరామ్‌కుమార్ బృందం గణేశా, వసంత, అర్ధనారీశ్వరం తదితర అంశాలపై నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. మాధవి మారెళ్లపూడి ధిల్లాన ఆర్ట్ అకాడమీ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఆహూతులను అలరించింది.



కళాకారుల నాట్య ప్రదర్శన